


జాతీయ తెలుగు దినపత్రిక

RNI - TGTEL/25/A0348

# సందేశ టైమ్స్

నిజం దాగదు – వార్త ఆగదు




| సోమవారం 04 మే 2026 | పేజీలు : 04 | వెల - రూ 2/- | సంపుటి : 01 సంచిక : 336 | ప్రచురణ : తెలంగాణ & ఆంధ్రప్రదేశ్ | ఎడిటర్ : శెట్టి వెంకటేష్ |
|---|---|---|---|---|---|



## రామగుండం కోల్ మైన్‌కు పర్యావరణ అనుమతులు సింగరేణి వినూత్న ప్రాజెక్టుకు గ్రీన్ సిగ్నల్

సందేశం టైమ్స్, హైదరాబాద్, మే 04, ప్రతినిధి: సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ రూపొందించిన వినూత్న రామగుండం కోల్ మైన్ ప్రాజెక్టుకు కేంద్ర పర్యావరణ, అటవీ మరియు వాతావరణ మార్పుల శాఖ ప్రాథమిక అనుమతులు మంజూరు చేయడంతో సంస్థకు భారీ ఊతం లభించింది. సింగరేణి చరిత్రలోనే అత్యధికంగా ఏడాదికి 210 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యంగా రూపొందించిన ఈ ప్రాజెక్టు ద్వారా మొత్తం 314.98 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలను సద్వినియోగం చేయాలని యాజమాన్యం లక్ష్యంగా పెట్టుకుంది. మూతపడిన జీడీకే-10 ఇంక్లైన్, వకీల్ పల్లి భూగర్భ గనులను ఓపెన్ కాస్ట్ గనులుగా మార్చి మిగిలిన బొగ్గును వెలికి తీయడంతో పాటు రామగుండం ఓసీ-1, ఓసీ-2 విస్తరణ ప్రాజెక్టులు మరియు అడ్రియాల అండర్ గ్రౌండ్ గనుల పరిధిలోని నిల్వలను సమగ్రంగా వినియోగించనున్నారు. ఈ ప్రాజెక్టు 25 సంవత్సరాల పాటు కొనసాగి రామగుండం రీజియన్‌కు కొత్త ఊపిరి పోయనుండగా, సుమారు 5,500 మందికి ఉపాధి అవకాశాలు కల్పించనుంది. మొత్తం 2,194 కోట్ల పెట్టుబడితో అమలు కానున్న ఈ ప్రాజెక్టులో 4326 హెక్టార్ల భూమి వినియోగించబడనుంది. ఇక్కడ ఉత్పత్తి అయ్యే బొగ్గును ప్రధానంగా ఎన్టీపీసీ రామగుండం మరియు ఇతర పరిశ్రమలకు సరఫరా చేయనున్నారు. పర్యావరణానికి భంగం కలగకుండా ఓవర్ బర్డెన్ మట్టిని ఖాళీ గనుల్లోనే నింపే విధంగా రూపొందించిన ఈ ప్రాజెక్టు సింగరేణి భవిష్యత్తుకు ఒక కీలక మైలురాయిగా నిలవనుందని అధికారులు పేర్కొన్నారు.



## వర్షంలోనూ ప్రజల మధ్య 'భరోసా' మంత్రి పొంగులేటి ప్రజా దర్బార్

సందేశం టైమ్స్, ఖమ్మం, మే 04, ప్రతినిధి: వర్షం కురుస్తున్నా ప్రజల సమస్యలు వినడంలో వెనుకడుగు వేయకుండా మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి పాలేరు నియోజకవర్గంలో నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో ప్రజలకు భరోసా కల్పించారు. తిరుమలాయపాలెం మండలం బచ్చోడు క్లస్టర్ పరిధిలోని 12 గ్రామ పంచాయతీల ప్రజల కోసం జిల్లా పరిషత్ హైస్కూల్ ఆవరణలో నిర్వహించిన ఈ కార్యక్రమం మధ్యలో వర్షం పడటంతో సభా ప్రాంగణం తడిసిపోయింది. అయినప్పటికీ మంత్రి అధికారులను అప్రమత్తం చేసి పాఠశాల తరగతి గదిలోనే కార్యక్రమాన్ని కొనసాగిస్తూ బాధితుల అర్జీలను స్వీకరించి వారి సమస్యలను వినిపించారు. వర్షంలో తడుస్తూ వచ్చిన ప్రజలకు "నేను ఉన్నాను.. మీ సమస్యలు త్వరగా పరిష్కరిస్తాం" అంటూ ధైర్యం చెప్పారు. అంతకుముందు మంత్రి మాట్లాడుతూ ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితులకు స్వస్తి పలకాలని, ప్రభుత్వమే నేరుగా ప్రజల గడప వద్దకు వెళ్లి సేవలు అందించాలనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లక్ష్యంతో ఈ క్లస్టర్ స్థాయి ప్రజా దర్బార్లు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. అలాగే అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు అందించే దిశగా ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు.


## చెరువుల పునరుద్ధరణకు ప్రత్యేక ప్రణాళిక – రాష్ట్రవ్యాప్తంగా పూడికతీత కార్యక్రమం వేగవంతం




సందేశం టైమ్స్, హైదరాబాద్, మే 04, ప్రతినిధి: రాష్ట్రవ్యాప్తంగా చెరువుల పునరుద్ధరణ కోసం ప్రత్యేక ప్రణాళికను అమలు చేస్తున్నట్లు నీటిపారుదల, ఆహార భద్రత, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. చెరువులలో పూడికతీత కార్యక్రమాన్ని విస్తృతంగా చేపట్టి వానాకాలానికి ముందే పనులు పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ల ఆధ్వర్యంలో ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేసి రైతులను భాగస్వామ్యంగా చేసుకుంటూ పనులను వేగవంతం చేయనున్నట్లు వివరించారు. కాల్వల మరమ్మతులు, ఆక్రమణల తొలగింపుపై ప్రత్యేక దృష్టి సారించి సాగునీటి సరఫరా మెరుగుపరచడమే లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. రైతులకు నీటి అందుబాటు పెంచి వ్యవసాయోత్పత్తి వృద్ధికి ఈ చర్యలు దోహదపడతాయని ఆయన తెలిపారు.


## మానవత్వం ముందుంటే అద్భుతాలు సాధ్యం – కేటీఆర్ సహాయానికి శరణ్య కృతజ్ఞతలు





సందేశం టైమ్స్, హైదరాబాద్, మే 04, ప్రతినిధి: "మానవత్వం ముందుంటే అద్భుతాలు సాధ్యం" అన్న మాటను నిజం చేస్తూ 2020లో బ్రెయిన్ ట్యూమర్‌తో బాధపడుతున్న తన కుమార్తె శరణ్యకు సర్జరీ కోసం సహాయం చేయాలని తల్లి పూజిత సోషల్ మీడియా ద్వారా విజ్ఞప్తి చేయగా వెంటనే స్పందించిన మంత్రి కేటీఆర్ ఆర్థిక సహాయం అందించారు. ఆ సహాయంతో విజయవంతంగా శస్త్రచికిత్స పూర్తిచేసుకుని ఆరోగ్యంగా కోలుకున్న శరణ్య ప్రస్తుతం 10వ తరగతి పూర్తి చేసి ఆరు సంవత్సరాల తర్వాత కేటీఆర్‌ను ప్రత్యక్షంగా కలిసి కృతజ్ఞతలు తెలియజేసింది. ఈ సందర్భంలో ఆమె కుటుంబం మంత్రి చేసిన సహాయాన్ని గుర్తుచేసుకుంటూ భావోద్వేగానికి లోనయ్యింది. కేటీఆర్ చూపిన మానవత్వం, స్పందన ప్రజల్లో విశ్వాసాన్ని పెంచిందని పలువురు అభిప్రాయపడ్డారు.

## జనాభా లెక్కల స్వీయ గణన–2027: ప్రజలు తమ వివరాలు నమోదు చేసుకోవాలి – కలెక్టర్ ప్రతీక్ జైన్



సందేశం టైమ్స్, సంగారెడ్డి జిల్లా, మే 04, ప్రతినిధి: జనాభా లెక్కల ప్రక్రియలో భాగంగా ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చిన సెల్ఫ్ ఎన్యూమరేషన్ (స్వీయ గణన) విధానాన్ని ప్రతి కుటుంబం వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు. ఈ స్వీయ గణన ప్రక్రియ మే 10 వరకు కొనసాగుతుందని, జిల్లాలోని ప్రతి కుటుంబం తమ వివరాలను స్వయంగా నమోదు చేసుకుని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ప్రజలు తమ వివరాలను స్వయంగా నమోదు చేయడం ద్వారా సమాచారం ఖచ్చితత్వం పెరగడంతో పాటు సమయం కూడా ఆదా అవుతుందని పేర్కొన్నారు. https://se.census.gov.in� వెబ్‌సైట్ ద్వారా లాగిన్ అయ్యి కుటుంబ వివరాలు నమోదు చేయాలని సూచించారు. నమోదు పూర్తయిన తర్వాత వచ్చే 11 అంకెల సెల్ఫ్ ఎన్యూమరేషన్ ఐడీని భద్రపరచుకోవాలని తెలిపారు. మే 11 తరువాత గణనాధికారి ఇంటికి వచ్చినప్పుడు ఈ ఐడీ చూపిస్తే ధృవీకరణ జరుగుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని వినియోగించుకుని ప్రభుత్వ కార్యక్రమానికి సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## తమిళనాడులో రిసార్ట్ రాజకీయాలు ప్రారంభం – టీవీకే అభ్యర్థులను మహాబలిపురం రిసార్ట్‌కు తరలింపు

సందేశం టైమ్స్, తమిళనాడు, మే 04, ప్రతినిధి: తమిళనాడులో ఎన్నికల ఫలితాల ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా విజయ్ నేతృత్వంలోని టీవీకే పార్టీ రిసార్ట్ రాజకీయాలకు తెరతీసింది. ఎగ్జిట్ పోల్స్‌లో హంగ్ అసెంబ్లీ వచ్చే అవకాశం ఉన్నట్లు అంచనాలు వెలువడుతున్న నేపథ్యంలో, పార్టీ అభ్యర్థులను చెదరిపోకుండా ఒకేచోట ఉంచేందుకు మహాబలిపురంలోని రిసార్ట్‌ను ముందుగానే బుక్ చేసినట్లు సమాచారం. అభ్యర్థులు బయటకు వెళ్లకుండా, పార్టీకి కట్టుబడి ఉండాలని విజయ్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు తెలుస్తోంది. ఇతర పార్టీల ప్రలోభాలకు లోనుకాకుండా ముందస్తు వ్యూహంగా ఈ చర్యలు తీసుకున్నారని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. గతంలో కూడా ఇలాంటి పరిస్థితుల్లో రిసార్ట్ రాజకీయాలు చోటుచేసుకోగా, ఇప్పుడు తమిళనాడులో అదే పరిస్థితి మళ్లీ కనిపిస్తోందని విశ్లేషకులు పేర్కొంటున్నారు.

# కరీంనగర్ జ్యువెలరీ షాప్ దోపిడీ కేసు విచారణ వేగవంతం



సందేశం టైమ్స్, కరీంనగర్, మే 04, ప్రతినిధి: కరీంనగర్‌లో కాల్పులతో జరిగిన జ్యువెలరీ షాప్ దోపిడీ కేసులో పోలీసులు దర్యాప్తును మరింత వేగవంతం చేశారు. ఈ ఘటనలో ఐదుగురు నిందితులు పాల్గొన్నట్లు గుర్తించిన పోలీసులు వారు రెండు బైకులపై పరారైనట్లు తెలిపారు. నిందితులందరూ పాత నేరస్తులుగా నిర్ధారించగా, హర్యానాకు చెందిన దోపిడీ గ్యాంగ్‌గా గుర్తించారు. దర్యాప్తులో భాగంగా నిందితులు ఉపయోగించిన తుపాకీలు, బుల్లెట్లు డ్రైనేజీలో గుర్తించగా, కొన్ని బుల్లెట్లు జ్యువెలరీ షాప్‌లో స్వాధీనం చేసుకున్నారు. కేసు విచారణ కోసం మొత్తం 12 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చేపట్టారు. సీసీ కెమెరా దృశ్యాల ఆధారంగా నిందితుల ఫోటోలను విడుదల చేసిన పోలీసులు, వారి ఆచూకీ తెలిపిన వారికి రూ.1 లక్ష బహుమతి ప్రకటించారు. పోలీసులు నిందితులను త్వరలోనే అరెస్టు చేస్తామని తెలిపారు.

# రేషన్ బియ్యం తక్కువ ఇస్తే ఫిర్యాదు చేయండి వినియోగదారుల హక్కులపై అవగాహన



సందేశం టైమ్స్, హైదరాబాద్, మే 04, ప్రతినిధి: పేదల కోసం ప్రభుత్వం పంపిణీ చేసే రేషన్ సరుకులు ప్రజల హక్కు తప్ప డీలర్ల దయ కాదని అధికారులు స్పష్టం చేస్తున్నారు. జాతీయ ఆహార భద్రతా చట్టం (NFSA) ప్రకారం ప్రతి కార్డు దారుడు నిర్ణీత పరిమాణంలో, నిర్ణీత ధరకే లేదా ఉచితంగా సరుకులు పొందే హక్కు కలిగి ఉంటాడు. రేషన్ షాపుల్లో తూకంలో తేడా వచ్చినా, డీలర్లు దురుసుగా ప్రవర్తించినా అది చట్టవిరుద్ధమని తెలిపారు. తూకం యంత్రం సరిగా లేకపోతే అక్కడికక్కడే తనిఖీ చేయాలని, డీలర్ నిరాకరిస్తే వెంటనే ఫిర్యాదు చేయాలని సూచించారు. రాష్ట్రంలో రేషన్ సమస్యలపై 1967 టోల్ ఫ్రీ నంబర్ ద్వారా ఫిర్యాదులు స్వీకరిస్తున్నారని వెల్లడించారు. అలాగే మండల తహసీల్దార్‌కు వ్రాతపూర్వక ఫిర్యాదు చేయడం ద్వారా తనిఖీలు నిర్వహించి అవసరమైతే డీలర్ లైసెన్స్ రద్దు చేసే అవకాశం ఉందని పేర్కొన్నారు. గ్రామ సభలు, వార్డు సమావేశాల్లో రేషన్ షాపుల పనితీరుపై ప్రజలు ప్రశ్నిస్తూ సామూహికంగా స్పందిస్తే సమస్యలకు త్వరగా పరిష్కారం లభిస్తుందని అధికారులు తెలిపారు.

# హైదరాబాద్‌లో బీటెక్ విద్యార్థిని ఆత్మహత్య మీర్‌పేట్‌లో విషాదం




సందేశం టైమ్స్, హైదరాబాద్, మే 04, ప్రతినిధి: హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలోని మీర్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో బీటెక్ విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన తీవ్ర కలకలం రేపింది. మహబూబ్‌నగర్‌కు చెందిన కుటుంబం బడంగ్‌పేట మారుతీనగర్‌లో నివాసం ఉంటుండగా, కీర్తి(21) గండిపేటలోని ఎంజీఐటీ కళాశాలలో బీటెక్ తృతీయ సంవత్సరం చదువుతోంది. శనివారం కళాశాలకు వెళ్లిన ఆమె మధ్యాహ్నం ఇంటికి చేరుకున్నది. సాయంత్రం కుటుంబ సభ్యులు బంధువుల ఇంటికి వెళ్లిన సమయంలో ఇంట్లో ఒంటరిగా ఉన్న కీర్తి డీజిల్ పోసుకుని నిప్పంటించుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మంటలు వ్యాపించి పొగలు రావడంతో అప్రమత్తమైన ఇరుగు పొరుగు వారు వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వారు ఇంటికి చేరుకునేసరికి కీర్తి మంటల్లో తీవ్రంగా కాలిపోయి ప్రాణాలు కోల్పోయింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఘటనకు గల కారణాలపై విచారణ కొనసాగుతోంది.

# మొక్కజొన్న కొనుగోళ్లపై కాంగ్రెస్ ప్రభుత్వంపై రైతు సంఘం ఆగ్రహం



సందేశం టైమ్స్, ఖమ్మం జిల్లా బోనకల్, మే 04, ప్రతినిధి: రైతుల పంటను కొనుగోలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోతినేని సుదర్శన్ రావు తీవ్రంగా విమర్శించారు. ఖమ్మం జిల్లా బోనకల్ మండలంలోని లక్ష్మీపురం, రావినూతల సొసైటీ పరిధిలో నిల్వ ఉన్న మొక్కజొన్న బస్తాలను ఆయన నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు తమ సమస్యలను వివరించగా, కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినప్పటికీ మొక్కజొన్నను కొనుగోలు చేయకుండా అధికారులు ఇబ్బందులకు గురిచేస్తున్నారని తెలిపారు. రైతులే బస్తాలు, లారీలు సమకూర్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. పోతినేని సుదర్శన్ రావు మాట్లాడుతూ రైతుల పోరాట ఫలితంగానే కొనుగోలు కేంద్రాలు ప్రారంభమయ్యాయని, కానీ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిలబెట్టుకోలేకపోతుందని విమర్శించారు. జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్నప్పటికీ రైతులకు ఉపయోగం లేకపోవడం దురదృష్టకరమన్నారు. యూరియా కొరత, కొనుగోళ్లలో పరిమితులు విధించడం వంటి చర్యలు రైతులను ఆర్థికంగా నష్టపరుస్తున్నాయని పేర్కొన్నారు. వాతావరణ మార్పుల కారణంగా పంట నష్టపోతుందనే ఆందోళన మధ్య కూడా ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరమన్నారు. రైతులు కదిలితేనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు అయ్యాయని, మరలా రైతుల పోరాటంతోనే బస్తాలు కదిలే పరిస్థితి ఉందని పేర్కొంటూ రైతులు ఐక్యంగా పోరాటాలకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రైతు సంఘం, సిపిఎం నాయకులు, స్థానిక రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎండౌమెంట్స్ శాఖలో 190 ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ పోస్టులకు ఆమోదం



**GOVERNMENT OF TELANGANA**
**ABSTRACT**

ESTABLISHMENT – Revenue (Endowments) Department – Creation of (190) Executive Officer Grade-I, Grade-II and Grade-III posts in the O/o Commissioner of Endowments Department, Hyderabad under the administrative control of the Revenue Department – Orders – Issued.

**FINANCE (HRM-I) DEPARTMENT**

**G.O.Ms.No.42** **Dated:30th April, 2026.**
**Read the following:-**

1. Revenue (Endowments) Department, U.O.No.22971/Endts.I/2023, dt:22.04.2026.

& & &

**ORDER:**

In the circumstances as explained by the Revenue (Endowments) Department vide reference read above, Government, after careful examination of the proposal, hereby accord sanction for creation of the (190) Executive Officer Grade-I, Grade-II and Grade-III posts in the O/o. Commissioner of Endowments Department, Hyderabad under the administrative control of the Revenue Department, as shown in Annexures-I & II, appended to this order.

02. The Revenue Department, Dr. B.R.Ambedkar Telangana Secretariat, Hyderabad, shall obtain the concurrence of the Finance (HRM) Department, before initiating action for filling up of the posts sanctioned in this order, wherever and to the extent the Service Rules prescribed for Direct Recruitment.

03. The Revenue Department, Dr. B.R.Ambedkar Telangana Secretariat, Hyderabad are requested to take further necessary action in the matter, accordingly.

**(BY ORDER AND IN THE NAME OF THE GOVERNOR OF THE TELANGANA)**

**SANDEEP KUMAR SULTANIA**
**PRINCIPAL SECRETARY TO GOVERNMENT**

To
The Revenue Department,
Dr. B.R.Ambedkar Telangana Secretariat, Hyderabad.
The Commissioner of Endowments, Telangana, Hyderabad.
*Copy to:*
The Prl. Accountant General (A&E/Audit-I & II), Telangana, Hyderabad.
The General Administration (Cabinet) Department,
Dr. B.R.Ambedkar Telangana Secretariat, Hyderabad for information.
The Director of Treasuries & Accounts, Telangana, Hyderabad.
The Pay and Accounts Officer, Hyderabad.
SF/SCs. (254/A1/HRM.I/2026)

**// FORWARDED :: BY ORDER //**

**SECTION OFFICER**

సందేశం టైమ్స్, హైదరాబాద్, మే 04, ప్రతినిధి: తెలంగాణ ప్రభుత్వం ఎండౌమెంట్స్ శాఖలో పరిపాలన బలోపేతం దిశగా కీలక నిర్ణయం తీసుకుంది. కమిషనర్ ఆఫ్ ఎండౌమెంట్స్ కార్యాలయంలో గ్రేడ్-1, గ్రేడ్-2, గ్రేడ్-3 ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ పోస్టులు మొత్తం 190 సృష్టించేందుకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ మేరకు ఫైనాన్స్ (హెచ్‌ఆర్‌ఎం-1) శాఖ జి.ఓ.ఎంఎస్ నం.42ను ఏప్రిల్ 30, 2026న జారీ చేసింది. రెవెన్యూ (ఎండౌమెంట్స్) శాఖ ప్రతిపాదనను పరిశీలించిన ప్రభుత్వం ఈ పోస్టుల సృష్టికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. పోస్టుల భర్తీ ప్రక్రియ ప్రారంభానికి ముందు ఫైనాన్స్ శాఖ అనుమతి పొందాలని, సేవా నియమావళి ప్రకారం నేరుగా నియామకాలు చేపట్టాల్సిన చోట అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. ఈ నిర్ణయంతో దేవాదాయ శాఖలో పరిపాలన సామర్థ్యం పెరిగి ఆలయాల నిర్వహణ మరింత సమర్థవంతంగా జరుగుతుందని అధికారులు పేర్కొన్నారు.

# మొక్కజొన్న కొనుగోళ్లలో నిర్లక్ష్యం – రైతులను ఆదుకోకపోతే కలెక్టరేట్ ముట్టడిస్తాం: బీఆర్ఎస్ హెచ్చరిక



సందేశం టైమ్స్, ఖమ్మం జిల్లా చింతకాని, మే 04, ప్రతినిధి: కాంగ్రెస్ ప్రభుత్వం రైతు పక్షాన ఉందని చెప్పడం మాటలకే పరిమితమైందని బీఆర్ఎస్ నాయకులు మండిపడ్డారు. చింతకాని మండలంలో 20 నుంచి 30 రోజులుగా కల్లాల్లోనే నిల్వ ఉన్న మొక్కజొన్న బస్తాల దుస్థితి దీనికి నిదర్శనమని పేర్కొన్నారు. కోదుమూరు గ్రామంలో నిర్వహించిన ప్రెస్ మీట్‌లో మాట్లాడుతూ ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో దేశబోయిన వెంకటేశ్వర్లుకు చెందిన ట్రాక్టర్ పూర్తిగా దగ్ధమై రూ.5 లక్షల నష్టం వాటిల్లగా, మరో లక్ష రూపాయల పంట నష్టం జరిగినట్లు తెలిపారు. అలాగే కొమ్మిని పుల్లయ్య, పొనుగోటి ప్రసాద్ రైతుల పంటలు కలిపి రూ.2 లక్షల మేర కాలి బూడిదయ్యాయని వివరించారు. ఘటనకు రెండు రోజులు గడిచినా అధికారులు నష్టం అంచనా వేయకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తిర్లాపురం, లచ్చగూడెం, తిమ్మినేనిపాలెం, బస్వాపురం గ్రామాల్లో అగ్నికి ఆహుతైన పంటలను లెక్కించి బాధితులకు తక్షణ పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. లచ్చగూడెంలో విద్యుత్ శాఖ నిర్లక్ష్యం వల్ల కరెంట్ షాక్‌తో గేదెలు మృతి చెందిన ఘటనపై కూడా ప్రభుత్వమే బాధ్యత వహించాలని కోరారు. మరోవైపు కొనుగోలు కేంద్రాల్లో బస్తాలు, లారీల కొరతతో రైతులు ఇబ్బందులు పడుతుండగా దళారులు తక్కువ ధరలకు ధాన్యం కొనుగోలు చేస్తున్నారని ఆరోపించారు. వెంటనే మొక్కజొన్న బస్తాలను గమ్యస్థానాలకు తరలించి రైతులను ఆదుకోవాలని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున కలెక్టరేట్ ముట్టడిస్తామని బీఆర్ఎస్ నాయకులు హెచ్చరించారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, రైతులు పాల్గొన్నారు.

# నాగలవంచలో సత్యసాయి విద్యానికేతన్, ప్రకృతి వైద్యాలయానికి భూమిపూజ ఏర్పాట్లు



సందేశం టైమ్స్, ఖమ్మం జిల్లా చింతకాని, మే 04, ప్రతినిధి: భగవాన్ శ్రీ సత్యసాయి బాబా ఆశీస్సులతో నాగలవంచ గ్రామంలో నిర్మించనున్న శ్రీ సత్యసాయి ప్రేమామృత విద్యా నికేతన్ పాఠశాల మరియు ప్రకృతి వైద్యాలయానికి మే 9న ఉదయం 10:30 గంటలకు జరగనున్న భూమిపూజ కార్యక్రమానికి ఏర్పాట్లు జోరుగా కొనసాగుతున్నాయి. నాగలవంచ నుంచి సీతంపేట రహదారి మధ్యలో శ్రీ కాటమయ్య దేవస్థానం ఎదురుగా ఉన్న శ్రీ చల్లా కోటయ్యకు చెందిన ఐదు ఎకరాల భూమిలో ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో సైట్ క్లీనింగ్ కార్యక్రమాన్ని శ్రీ సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో సత్యసాయి సేవా సంస్థల తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు దమ్మాలపాటి సుధాకర్, జిల్లా కార్యవర్గ సభ్యులు, భజన మండలి కన్వీనర్లు, పరిసర గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

# అగ్నిప్రమాదం, అకాలవర్షం దెబ్బకు రైతులకు భారీ నష్టం




సందేశం టైమ్స్, ఆదిలాబాద్/మహబూబాబాద్, మే 04, ప్రతినిధి: రాష్ట్రంలోని పలు జిల్లాల్లో రైతాంగం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోంది. ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలం కన్గుట్ట గ్రామంలో ఒక్కసారిగా చెలరేగిన అగ్నిప్రమాదంతో సుమారు వంద ఎకరాల్లో సాగు చేసిన మొక్కజొన్న పంట కాలి బూడిదైంది. ఒక చేనులో మొదలైన మంటలు గాలుల తీవ్రత కారణంగా వేగంగా పక్క పొలాలకు వ్యాపించి బోథ్, సాకెరా గ్రామ శివార్ల వరకూ విస్తరించాయి. గంటల పాటు మంటలు అదుపులోకి రాకపోవడంతో అగ్నిమాపక సిబ్బంది, స్థానికులు తీవ్రంగా శ్రమిస్తున్నారు. కళ్లముందే పంట బూడిదవుతుండటంతో రైతులు కన్నీరుమున్నీరవుతున్నారు. ఇదే సమయంలో మహబూబాబాద్ జిల్లాలో ఈదురుగాలులు, అకాల వర్షాలు కురవడంతో కొనుగోలు కేంద్రాల్లో నిల్వ ఉంచిన ధాన్యం తడిసి ముద్దవుతోంది. వేల రూపాయల పెట్టుబడితో పండించిన పంట నష్టపోవడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మంటలు మరింత విస్తరించకుండా, వర్షాల ప్రభావంతో నష్టపోయిన రైతులకు తక్షణ సాయం అందించాలని స్థానికులు అధికారులను కోరుతున్నారు.

# పిడుగుపాటుకు కార్మికుడు బలి – ధాన్యం కేంద్రంలో విషాదం



సందేశం టైమ్స్, మహబూబాబాద్ జిల్లా కురవి, మే 04, ప్రతినిధి: మహబూబాబాద్ జిల్లా కురవి మండలం సుధానపల్లి గ్రామంలో అకాల వర్షం మధ్య పిడుగుపాటుతో ఓ కార్మికుడు మృతి చెందిన ఘటన విషాదాన్ని మిగిల్చింది. వరి ధాన్యం కొనుగోలు కేంద్రంలో పనిచేస్తున్న నీలం వెంకన్న (40)పై ఆదివారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం సమయంలో పిడుగు పడటంతో అక్కడికక్కడే కుప్పకూలాడు. స్థానికులు వెంటనే ఆసుపత్రికి తరలించగా అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఘటనతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకోగా కుటుంబ సభ్యులు విలపిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పిడుగుల సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

## పాతర్లపాడులో అగ్నిప్రమాదం – సర్పంచ్ అప్రమత్తతతో మంటలు అదుపు



సందేశం టైమ్స్, ఖమ్మం జిల్లా, మే 04, ప్రతినిధి: పాతర్లపాడు గ్రామంలో గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో చెలరేగిన మంటలు మొక్కజొన్న కళ్లకు వ్యాపించి భారీ నష్టం కలిగించే పరిస్థితి ఏర్పడింది. ఈదురుగాలుల కారణంగా మంటలు వేగంగా వ్యాపించి పంటలను దహనం చేస్తున్న వేళ గ్రామ సర్పంచ్ ఓబినబోయిన లక్ష్మి-అచ్చయ్య సమయోచితంగా స్పందించి వాటర్ ట్యాంకర్ సహాయంతో పాటు గ్రామ ప్రజల సహకారంతో మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. దీంతో పెద్ద నష్టం తప్పినట్లు గ్రామస్థులు తెలిపారు. అయితే ఇప్పటికే తూకం వేసి నెలలు గడిచినా మొక్కజొన్న బస్తాలను తరలించడానికి లారీలు లేక కళ్లల్లోనే నిల్వ ఉండటంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వెంటనే లారీలు ఏర్పాటు చేసి బస్తాలను తరలించాలని రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది, రైతులు, గ్రామ యువత పాల్గొన్నారు.

## నూతన వధూవరులకు ఆశీస్సులు అందించిన కొప్పుల శేషారెడ్డి



సందేశం టైమ్స్, మెదక్ జిల్లా అల్లాదుర్గం, మే 04, ప్రతినిధి: అల్లాదుర్గం మండలంలోని అప్పాజీపల్లి మాజీ సర్పంచ్ స్వరూప శ్రీనివాస్ కుమారుడు రితీష్ వివాహం రాధతో బోడుమట్‌పల్లి శ్రీరామ్ గార్డెన్‌లో ఘనంగా జరిగింది. ఈ వేడుకకు ముఖ్య అతిథులుగా అల్లాదుర్గ్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొప్పుల శేషారెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు కురుమ మహేష్, సోషల్ మీడియా కోఆర్డినేటర్ జైపాల్, బాను, శేఖర్, బ్రమ్మయ్య, నవీన్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, బంధువులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు.

## రాంసాన్‌పల్లిలో సీసీఐ వరి కొనుగోలు కేంద్రం ప్రారంభం



సందేశం టైమ్స్, సంగారెడ్డి జిల్లా ఆందోల్ మండలం, మే 04, ప్రతినిధి: ఆందోల్ మండలంలోని రాంసాన్‌పల్లి గ్రామంలో సీసీఐ ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల ఏపీఎం దేవేందర్, సీసీ సత్యనారాయణ, గ్రామ వీవో మన్నే హేమలత, గ్రామ సంఘం ఒబీ పాల్వంచ పుష్పలత, గ్రామ సర్పంచ్ పండుగ హనుమంతు పాల్గొన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు పెద్ద సంఖ్యలో హాజరై రైతులకు కొనుగోలు కేంద్రం ద్వారా సౌకర్యం కలగనుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అధికారులు రైతులు తమ ధాన్యాన్ని కేంద్రానికి తీసుకువచ్చి ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు విక్రయించాలని సూచించారు.

## రైతు వారోత్సవం నేడు – రైతులకు అవగాహన కార్యక్రమం




సందేశం టైమ్స్, సంగారెడ్డి జిల్లా ఆందోల్ మండలం, మే 04, ప్రతినిధి: తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన ప్రగతి 99 రోజుల ప్రణాళికలో భాగంగా రైతు వారోత్సవం కార్యక్రమం సోమవారం చింతకుంట గ్రామంలోని రైతు వేదిక కార్యాలయంలో నిర్వహించనున్నారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో నేల ఆరోగ్య పరిరక్షణ, సమతుల ఎరువుల వినియోగం, సహజ వ్యవసాయం, నాణ్యమైన విత్తనాల వినియోగం, వ్యవసాయ యాంత్రీకరణ వంటి అంశాలపై రైతులకు శాస్త్రీయ పద్ధతుల్లో అవగాహన కల్పించనున్నారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమంలో రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని నిపుణుల సలహాలు, సూచనలు తెలుసుకుని మెరుగైన దిగుబడులు సాధించాలని అధికారులు సూచించారు.

## మల్లన్న జాతర ఉత్సవాల్లో పాల్గొన మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్



సందేశం టైమ్స్, మెదక్ జిల్లా అల్లాదుర్గ్ మండలం, మే 04, ప్రతినిధి: అల్లాదుర్గ్ మండలంలోని గడి పెద్దాపూర్ గ్రామంలో నిర్వహించిన మల్లికార్జున స్వామి (మల్లన్న) జాతర ఉత్సవాలు భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా జరిగాయి. ఈ ఉత్సవాల్లో మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ నాయకులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారి దర్శనం చేసుకుని భక్తిభావంతో కార్యక్రమంలో పాల్గొన్నారు. జాతర సందర్భంగా గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

## వీరభద్ర స్వామి కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్న మంత్రి దామోదర్ రాజనరసింహ





సందేశం టైమ్స్, మెదక్ జిల్లా టేక్మాల్, మే 04, ప్రతినిధి: టేక్మాల్ మండలం బొడ్మట్పల్లి గ్రామంలోని శ్రీ భద్రకాళి సమేత వీరభద్ర స్వామి ఆలయంలో నిర్వహించిన కళ్యాణ మహోత్సవంలో తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనరసింహ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో భక్తులతో కలిసి ప్రార్థనలు చేసిన మంత్రి రాష్ట్ర ప్రజలు సుఖశాంతులతో ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువజన సంఘాల నాయకులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశంలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకుల


సందేశం టైమ్స్, మెదక్ జిల్లా టేక్మాల్, మే 04, ప్రతినిధి: టేక్మాల్ మండలంలోని గొల్లగూడెం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద నిర్మించిన గృహాల గృహప్రవేశ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టేక్మాల్ మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ తిమ్మి సుధాకర్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నిమ్మ రమేష్ హాజరై రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రజా పాలనలో ఇందిరమ్మ ఇళ్ల మంజూరుతో పేదలకు ఇళ్లు నిర్మించుకోవడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సుబేదార్ మణికిషన్, జిల్లా కాంగ్రెస్ మైనార్టీ కమిటీ చైర్మన్ షేక్ మజహర్, మాజీ సర్పంచ్ ఆకులపల్లి పాపయ్య, టౌన్ ప్రెసిడెంట్ భక్తుల కిషోర్, శ్రీధర్ చారి, మన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రశాంత వాతావరణంలో నీట్ పరీక్షలు – 465 మంది హాజరు



సందేశం టైమ్స్, మెదక్ జిల్లా, మే 04, ప్రతినిధి: మెదక్ జిల్లాలో నిర్వహించిన నీట్ పరీక్షలు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా ప్రశాంత వాతావరణంలో ముగిశాయని అదనపు కలెక్టర్ నగేష్ తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల పరీక్షా కేంద్రంలో నిర్వహించిన ఈ పరీక్షకు మొత్తం 479 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా 465 మంది హాజరయ్యారని, 15 మంది గైర్హాజరైనట్లు అధికారులు వెల్లడించారు. పరీక్షా కేంద్రాన్ని అదనపు కలెక్టర్ నగేష్, మెదక్ ఆర్డీవో రమాదేవి పరిశీలించారు. ఈ సందర్భంగా సీసీ కెమెరాల పనితీరు, బయోమెట్రిక్ విధానం అమలు తీరును అధికారుల ద్వారా సమీక్షించారు. పరీక్షలు పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా జరిగేలా పటిష్ట ఏర్పాట్లు చేసినట్లు అధికారులు తెలిపారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఇన్విజిలేటర్లు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పరీక్షా కేంద్రాల వద్ద గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో తాసిల్దార్ లక్ష్మణ్ బాబు, పరీక్ష కేంద్ర నిర్వాహకులు, పోలీస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## వీరభద్ర స్వామి దర్శనం చేసిన మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్



సందేశం టైమ్స్, మెదక్ జిల్లా టేక్మాల్ మండలం, మే 04, ప్రతినిధి: టేక్మాల్ మండలం బొడ్మట్‌పల్లి గ్రామంలోని శ్రీ భద్రకాళి సమేత వీరభద్ర స్వామి బ్రహ్మోత్సవాలు భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా కొనసాగుతున్నాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన కళ్యాణ మహోత్సవాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టేక్మాల్ మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు భక్తుల వీరప్పతో పాటు స్థానిక పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పరిసర గ్రామాల నుండి వచ్చిన భక్తులతో ఆలయం కిక్కిరిసిపోయింది. ఆలయ కమిటీ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసింది.

## వ్యవసాయ వారోత్సవాలు విజయవంతంగా నిర్వహించాలి జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ ఆదేశాలు



సందేశం టైమ్స్, మెదక్ జిల్లా, మే 04, ప్రతినిధి: మెదక్ జిల్లాలో వ్యవసాయ వారోత్సవాలను విజయవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులను ఆదేశించారు. ప్రజల సమస్యల సత్వర పరిష్కారం లక్ష్యంగా రేపటి నుండి డివిజన్ స్థాయిలో ప్రజావాణి కార్యక్రమాలను నిర్వహించేందుకు సమగ్ర ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి అదనపు కలెక్టర్ నగేష్, జిల్లా అధికారులు, వ్యవసాయ అధికారులు, ఆర్డీవోలతో గూగుల్ మీట్ ద్వారా నిర్వహించిన సమీక్షలో ఈ ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలో జనగణనను పటిష్టంగా, సమర్థవంతంగా నిర్వహించాలని కూడా స్పష్టం చేశారు.రేపటి నుండి ప్రారంభమయ్యే వ్యవసాయ వారోత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని, షెడ్యూల్ ప్రకారం వ్యవసాయ శాఖ అధికారులు కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లాలని తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణి కార్యక్రమాన్ని ఇకపై రెవెన్యూ డివిజన్ స్థాయిలో కూడా నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ప్రతి సోమవారం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయి ప్రజావాణి కొనసాగుతుందని, అదనంగా ఆర్డీవో కార్యాలయాల్లో కూడా వినతులు స్వీకరించనున్నట్లు తెలిపారు.ప్రజల ఫిర్యాదులను ప్రజావాణి పోర్టల్‌లో నమోదు చేసి ప్రతి వినతికి ప్రత్యేక నంబర్ కేటాయించబడుతుందని, 30 రోజుల్లోగా పరిష్కరించి చర్యల నివేదికను అప్‌లోడ్ చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు తమ ఫిర్యాదుల స్థితిని ఆన్‌లైన్‌లో తెలుసుకునే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. అన్ని శాఖల అధికారులు ప్రజావాణిలో తప్పనిసరిగా పాల్గొని సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కలెక్టర్ సూచించారు.

## వి.బి.ఎస్ ముగింపు వేడుకలో చిన్నారులకు బహుమతులు – అస్మా



సందేశం టైమ్స్, జహీరాబాద్, మే 04, ప్రతినిధి: జహీరాబాద్ మండలం చిరాగ్‌పల్లి గ్రామంలోని న్యూ అపోస్తాలిక్ చర్చిలో గత వారం రోజులుగా నిర్వహించిన వేకేషన్ బైబిల్ స్కూల్ (వి.బి.ఎస్) తరగతుల ముగింపు కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జహీరాబాద్ నియోజకవర్గ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అస్మా హాజరై చిన్నారులను ప్రోత్సహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యేసు క్రీస్తు బోధనలు జీవితంలో మంచి మార్గాన్ని చూపుతాయని, చిన్ననాటి నుంచే పిల్లలు క్రమశిక్షణ, మంచి ప్రవర్తన అలవరచుకోవాలని సూచించారు. వి.బి.ఎస్ వేదికగా తమ ప్రతిభను పిల్లలు వెలికి తీయాలని, తల్లిదండ్రులు కూడా వారి కలలను ప్రోత్సహించాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా నాట్యాలు, పాటలు, బైబిల్ కథల ప్రదర్శన చేసిన చిన్నారులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాస్టర్ ఎం. అశోక్‌తో పాటు సంఘ లేమెన్ లాజర్, తుకారాం, అనిల్, రమేష్, అబ్రహామ్ తదితరులు పాల్గొన్నారు.

## సంగారెడ్డి జిల్లాలో ప్రశాంతంగా ముగిసిన నీట్ (యూజీ)–2026 పరీక్ష



సందేశం టైమ్స్, సంగారెడ్డి జిల్లా, మే 04, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లాలో ఆదివారం నిర్వహించిన నీట్ (యూజీ)–2026 పరీక్ష ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా ప్రశాంతంగా ముగిసింది. పరీక్ష నిర్వహణను అడిషనల్ కలెక్టర్ పాండు పర్యవేక్షించి పలు పరీక్షా కేంద్రాలను సందర్శించారు. సంగారెడ్డిలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, పోతిరెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, తార డిగ్రీ కళాశాల, ఇస్నాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఇస్నాపూర్ టీఎస్ఎస్‌డబ్ల్యూఆర్ఎస్ పాఠశాల, అలాగే ఎద్దు మైలారం ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలోని కేంద్రీయ విద్యాలయ కేంద్రాలను ఆయన పరిశీలించారు. పరీక్షా కేంద్రాల్లో అభ్యర్థులకు కల్పించిన సౌకర్యాలు, భద్రతా ఏర్పాట్లు, నిర్వహణ విధానాన్ని సమీక్షించి సంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లాలో మొత్తం 2,772 మంది అభ్యర్థులకు గాను 2,704 మంది పరీక్షకు హాజరుకాగా 68 మంది గైర్హాజరైనట్లు అధికారులు తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ భారతీదేవి పాల్గొన్నారు.

## న్యాల్కల్ మండలంలో పేకాటపై దాడి – ఐదుగురు అదుపులోకి



సందేశం టైమ్స్, సంగారెడ్డి జిల్లా న్యాల్కల్, మే 04, ప్రతినిధి: న్యాల్కల్ మండలం రెజింతల్ గ్రామ పరిధిలోని ముస్లిం శ్మశాన వాటిక వెనుక ఖాళీ స్థలంలో పేకాట జరుగుతున్నట్లు అందిన నమ్మదగిన సమాచారం మేరకు హద్దునూర్ ఎస్సై ఆధ్వర్యంలో పోలీసులు దాడి నిర్వహించారు. 03-05-2026న జరిగిన ఈ రైడ్‌లో పేకాట ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 52 పేకాట ముక్కలు, రూ.4,150 నగదు, 3 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగుతున్నట్లు పోలీసులు తెలిపారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు తమ పరిసరాల్లో జరుగుతున్న జూదం, ఇతర నేరాలపై పోలీసులకు సమాచారం అందించాలని ఎస్సై విజ్ఞప్తి చేశారు.

## చెరువులో మునిగి కూలీ మృతి – చేపల వల చిక్కి విషాదం



సందేశం టైమ్స్, సంగారెడ్డి జిల్లా ఝరాసంగం, మే 04, ప్రతినిధి: ఝరాసంగం మండలం జిల్లపల్లి గ్రామానికి చెందిన పిచ్చగుంట్ల సంగప్ప (52) చెరువులో మునిగి మృతి చెందిన ఘటన విషాదాన్ని మిగిల్చింది. 03-05-2026న జీర్లపల్లి గ్రామ శివారులోని చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లిన ఆయన కాలికి చేపల వల చిక్కుకోవడంతో నీటిలో మునిగి ఊపిరాడక మృతి చెందినట్లు సమాచారం. ఈ ఘటనపై మృతుడి కుమారుడు పిచ్చకుంట్ల పాపయ్య ఝరాసంగం పోలీసులకు సమాచారం అందించగా, పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని చెరువులో నుంచి వెలికి తీశారు. అనంతరం కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## మెదక్ ఆర్డీవో కార్యాలయంలో డివిజనల్ స్థాయి ప్రజావాణి ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీవో రమాదేవి పిలుపు




సందేశం టైమ్స్, మెదక్ జిల్లా, మే 04, ప్రతినిధి: మెదక్ ఆర్డీవో కార్యాలయంలో డివిజనల్ స్థాయి ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆర్డీవో రమాదేవి తెలిపారు. ప్రజా పాలన ప్రగతి 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించి వారి సమస్యలను సత్వరంగా పరిష్కరించేందుకు ఈ కార్యక్రమం నిర్వహించబడుతున్నట్లు ఆమె వెల్లడించారు. ప్రజావాణికి సంబంధించిన దరఖాస్తులను ప్రత్యేకంగా రిజిస్టర్ చేసి సిటిజన్ ఐడీ ద్వారా నమోదు చేసి శాఖల వారీగా పరిష్కరించనున్నట్లు తెలిపారు. 30 రోజుల్లోగా సిటిజన్ చార్టర్ మార్గదర్శకాల ప్రకారం సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని మెదక్ డివిజన్ ప్రజలు, రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీవో రమాదేవి విజ్ఞప్తి చేశారు.

## బొల్లారంలో సీఐటీయూ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం



సందేశం టైమ్స్, పటాన్చెరు, మే 04, ప్రతినిధి: మే డే వార్షికోత్సవం సందర్భంగా బొల్లారం ప్రాంతంలో సీఐటీయూ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. రాష్ట్ర కమిటీ సభ్యులు రాజయ్య ఈ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల సంక్షేమం కోసం సీఐటీయూ నిరంతరం కృషి చేస్తుందని, వారి ఆరోగ్య పరిరక్షణ కోసం ఈ ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. శిబిరంలో పలువురు కార్మికులు పాల్గొని వైద్య సేవలు పొందారు.

## జహీరాబాద్‌లో బీదర్ కిడ్నీ సెంటర్ బ్రాంచ్ ప్రారంభం




సందేశం టైమ్స్, సంగారెడ్డి జిల్లా జహీరాబాద్, మే 04, ప్రతినిధి: జహీరాబాద్ పట్టణంలోని బసవనగర్ కాలనీలో బీదర్ కిడ్నీ సెంటర్ జహీరాబాద్ బ్రాంచ్‌ను ఘనంగా ప్రారంభించారు. తెలంగాణ రాష్ట్ర ఇండస్ట్రియల్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మహమ్మద్ తన్వీర్ ముఖ్య అతిథిగా హాజరై రిబ్బన్ కట్ చేసి కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన నెఫ్రాలజీ, యూరాలజీ వైద్య సేవలు ఒకేచోట అందుబాటులోకి రావడం సంతోషకరమని తెలిపారు. కిడ్నీ సంబంధిత వ్యాధులపై అవగాహన పెంపొందించడం అవసరమని, ఇలాంటి ఆరోగ్య కేంద్రాలు సమాజానికి ఎంతో మేలు చేస్తాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఉచిత మెగా కిడ్నీ స్క్రీనింగ్ క్యాంప్, ఉచిత ల్యాబ్ పరీక్షలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

## తన 39వ జన్మదిన సందర్భంగా 14వ సారి రక్తదానం చేసిన ఆర్ఎంపీ డాక్టర్ బంగార్రాజు




సందేశం టైమ్స్, సంగారెడ్డి జిల్లా, మే 04, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ నియోజకవర్గం నిజాంపేట్ మండల పరిధిలోని ర్యాలమడుగు మాణిక్ నాయక్ తండాకు చెందిన ఆర్ఎంపీ డాక్టర్ బంగార్రాజు తన 39వ జన్మదిన సందర్భంగా 14వ సారి రక్తదానం చేసి ఆదర్శంగా నిలిచారు. ఈ సందర్భంగా సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిలో రక్తదానం చేసిన ఆయన మాట్లాడుతూ, ఒకరి రక్తదానం మరొకరి ప్రాణాలను కాపాడుతుందని పేర్కొన్నారు. "జితే జితే రక్తదాన్, జాతే జాతే అవయవ దాన్" అనే భావనతో ముందుకు సాగుతున్నానని తెలిపారు. భవిష్యత్తులో కూడా అత్యవసర పరిస్థితుల్లో అవసరమైన వారికి రక్తదానం చేస్తానని ఆయన తెలిపారు. ఆయన సేవా భావాన్ని వైద్య సిబ్బంది, స్థానికులు అభినందించారు.

## మంజీరా నదిలో కరెంట్ షాక్‌తో గేదె మృతి రైతు కుటుంబానికి భారీ నష్టం



సందేశం టైమ్స్, అందోల్ మండలం, మే 04, ప్రతినిధి: అందోల్ మండలం పోసానిపేట గ్రామంలో మంజీరా నది అంచున లిఫ్ట్ మోటార్ వద్ద కరెంట్ షాక్ తగలడంతో గేదె మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. నాయికోటి నగేష్ (తండ్రి మాణిక్యం)కు చెందిన గేదె నీరు తాగేందుకు నదిలోకి వెళ్లిన సమయంలో విద్యుత్ లీకేజీ కారణంగా షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. అదే సమయంలో మరో రెండు గేదెలు కూడా ప్రవహంలోకి వెళ్లినప్పటికీ స్వల్పంగా తప్పించుకున్నాయి. మృతి చెందిన గేదె విలువ సుమారు రూ.80,000 వరకు ఉంటుందని కుటుంబ సభ్యులు తెలిపారు. పాల వ్యాపారంపై ఆధారపడి జీవిస్తున్న తమకు ఇది తీవ్ర నష్టం కలిగించిందని బాధిత కుటుంబం ఆవేదన వ్యక్తం చేసింది. ప్రభుత్వం వెంటనే పరిహారం అందించాలని గ్రామ సర్పంచ్ గోపాల్, ఉపసర్పంచ్ రాములు, గ్రామ పెద్దలు, సెక్రటరీతో పాటు గ్రామస్తులు కోరారు.

## కోదాడ హైవేపై భారీ వర్షంతో ట్రాఫిక్ స్తంభనం – విద్యుత్ వైర్లు తెగి ప్రయాణికుల ఇబ్బందులు



సందేశం టైమ్స్, సూర్యాపేట జిల్లా, మే 04, ప్రతినిధి: కోదాడ హైవేపై భారీ వర్షం కారణంగా ట్రాఫిక్ స్తంభించిన ఘటన చోటుచేసుకుంది. కట్టకొమ్మగూడెం–ఉత్తమ్ పద్మావతి నగర్ హైవే మార్గంలో ఆర్టీసీ బస్సులు, లారీలు, కార్లు నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. బలమైన గాలులు, వర్షం కారణంగా విద్యుత్ వైర్లు తెగిపడటంతో రహదారిపై విద్యుత్ అంతరాయం ఏర్పడి రాకపోకలు నిలిచిపోయాయి. ఈ ఘటనతో హైవేపై భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. అధికారులు సమాచారం అందుకుని పరిస్థితిని నియంత్రించే చర్యలు చేపట్టారు.

పత్రిక పేరు : సందేశం టైమ్స్ (Sandesham Times) – రిజిస్ట్రేషన్ నం :TGTEL/25/A0348, టైటిల్ కోడ్: Sandhesham Times,(పబ్లికేషన్: అమృత వెంకట్ మీడియా పబ్లికేషన్ ప్రైవేట్ లిమిటెడ్.) ప్రచురణ స్థలం: 3-82, వాయిల సింగారం గ్రామం, అనంతగిరి మండలం, సూర్యాపేట జిల్లా, తెలంగాణ – 508206, ప్రచురణకర్త / publisher : కాసే అమృత, మొబైల్: 9052045435, ఈ-మెయిల్: sandeshamtimes@gmail.com, వెబ్‌సైట్: www.sandeshamtimes.com, ముద్రణ స్థలం: సండే ప్రింటింగ్ ప్రెస్ (Sunday Printing Press), 3-4297, సరస్వతి కాంప్లెక్స్, SVN కాలనీ, గుంటూరు, ఆంధ్రప్రదేశ్ – 522006.